సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న ఆహుతులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని సెయింట్ ఆంథ్రూస్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. పలు తరగతుల విద్యార్థులు పెరుగుతున్న కాలుష్య సమస్యను ఎలా అధిగమించాలి..., జలాలు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,రోడ్డు భద్రత తదితర అంశాలపై ఇక్కడ స్టాల్స్‌ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శంబంగి రాధిక, కరస్పాండెంట్ విఘ్నేశ్వరరావు అభినందించారు.

ఆల్ఫా కృష్ణకు అభినందనలు


ఆల్ఫా కృష్ణను అభినందిస్తున్న బద్రీనాథ్

మల్కాపురం: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా రెండో సారి బాధ్యతలు స్వీకరించిన ఆల్ఫా కృష్ణను శనివారం పారిశ్రామిక ప్రాంత నాయకులు అభినందనలు తెలిపారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు,63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి,అమరావతి, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, 59 వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ,కృష్ణప్పారావునాయుడు తదితరులు ఉన్నారు.

100 మంది విద్యార్థుల రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం: నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ జి. సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల మరొకరికి ప్రాణదానం చేయవచ్చునన్నారు. శిబిరానికి ఫస్ట్ బ్లడ్ బ్యాంక్, సంజీవని బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిమిరెడ్డి వీరు నాయుడు పాల్గొన్నారు.

కూచిపూడి పితామహుడి పేరిట స్మారక పురస్కారం


ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి విరాళం డీడీ అందిస్తున్న ఆచార్య సరస్వతి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నృత్య విభాగంలో స్మారక బహుమతిని ఏర్పాటు చేశారు. విభాగ ఆచార్యురాలు కె.సరస్వతి విద్యార్థి తన సొంత నిధుల నుంచి రూ 1.5 లక్షలు విరాళంగా అందించి 'కూచిపూడి పితామహ శ్రీ సిద్దేంద్రయోగి మెమోరియల్ ప్రైజ్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని ఆమె కలిసి ప్రైజ్ ఏర్పాటుకు అవసరమైన నిధులకు సంబంధించిన డీడీని అందించారు. విభాగంలో ఎంఏ డ్యాన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఈ ప్రైజ్ ఇవ్వాలని సరస్వతి కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

'టిడ్కో గృహ'మహోత్సవం

- సామూహిక వ్రతాలతో సందడి
- లబ్ధిదారులకు తాళాలు అందజేసిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్, ఆనంద్ కుమార్

పద్మనాభనగర్, ములగాడ టిడ్కో గృహ సముదాయం వద్ద పండగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులు సంప్రదాయ వస్త్రాల్లో తమ సొంతింటిని చూసి మురిపోయారు. బాడుగ బాధల నుంచి విముక్తి పొందుతున్న సంతోషం వారి కళ్లల్లో కనిపించింది. మా ఇంట్లో అడుగుపెడుతున్నామన్న సంతోషం మదినిండా కనిపించింది. గృహ సముదాయాల వద్ద సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 92వ వార్డు కార్పొరేటర్ బెహరా స్వర్ణలత శివదేవి, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర రావు దంపతులు వ్రతాలు ఆచరించారు. వీరిని అనుసరించి గృహ లబ్ధిదారులు వ్రతాలు చేశారు. సత్యనారాయణ వ్రతంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.


సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న టిడ్కో లబ్ధిదారులు


పద్మనాభనగర్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి, ఆనంద్‌కుమార్, మళ్ల, జమ్మాన


పద్మనాభనగర్‌లో టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ


లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు తాళం అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్


భోజనాల వద్ద సందడి

గోపాలపట్నం: గత ప్రభుత్వంలో డబ్బులు వసూలు చేసి వదిలేసిన టిడ్కో ఇళ్లను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని రాజ్య సభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. పద్మనాభనగర్‌లో టిడ్కో గృహ సముదాయాలను ఆయన శనివారం టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం గృహాల లబ్ధిదారులకు దుస్తులు, ఇంటి తాళాం, రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గృహ ప్రవేశాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ. 230 కోట్లతో 3216 గృహాలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వారందరికీ గూడు కల్పించాలనే లక్ష్యంతో ఈ బృహత్తర ఘట్టానికి శ్రీకారం చుట్టారన్నారు.

డబ్బులు వసూలు చేసి వదిలేశారు

గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి మధ్యలో వదిలేశారన్నారు. మన ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్ద మనసుతో ఇళ్లు పూర్తి చేయడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. మహిళలకు భరోసాగా నిలిచే విధంగా వారి పేరునే రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. నీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన విధానం...వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత ఏవిధమైన లబ్ధి చేకూరిందో వివరించారు. దీని కోసం విధంగా ఇక్కడ ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేశారు. పద్మనాభనగర్‌లో లబ్ధిదారులకు రూ.14.33 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోన్–8 కమిషనర్ హేమవతి, టిడ్కో హౌసింగ్ అధికారులు, కార్పొరేటర్లు పీవీ సురేష్, ముర్రు వాణి నానాజీ, గుండపు నాగేశ్వరరావు, నాయకులు పేడాడ రమణకుమారి, గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీ కృష్ణ పాల్గొన్నారు.

అధునాత వసతులతో టిడ్కో గృహాలు

మల్కాపురం: అధునాతన వసతులతో టిడ్కో ఇళ్లు నిర్మించడంతో పాటు రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మనసుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు ములగాడ వద్ద నిర్మించిన 336 టిడ్కో ఇళ్లకు సంబంధించిన పత్రాలను శనివారం ఆనంద్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల మోములో సంతోషం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు బద్రీనాథ్,కార్పొరేటర్లు పి.వి.సురేష్,లావణ్య, గుండపు నాగేశ్వరరావులతో పాటు పార్టీ నాయకులు ధనలత,రేవళ్ల సత్యనారాయణ,దాట్ల శ్రీనివాసరావు,ధర్మల వేణు పాల్గొన్నారు.

సంతోషంగా గృహ ప్రవేశాలు



మాకు సొంతగూడు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇంటి పత్రాలు అందిస్తారని తెలుసుకున్న మామ పిల్లలు,కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు.మాకు కేటాయించిన ఇంట్లో ఇంత ఘనంగా గృహ ప్రవేశం చేయడం గొప్ప అనుభూతిగా ఉంది.

–అన్నం లక్ష్మి, సింధియా

ఓటుతో రుణం తీర్చుకుంటాం



గూడు లేని నిరుపేదకు పలు వసతులతో కూడిన గృహాలు ఇవ్వాలని ఏ నాయకుడు ఆలోచన చేయడు.అది కేవలం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యం అయింది. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే జగన్ మోహన్‌రెడ్డి రుణం మేము ఓటు ద్వారా తీర్చుకుంటాం.

–దారపురెడ్డి లక్ష్మి,శ్రీహరిపురం

పండగలా సాగింది



మేము ఇంట్లో దిగే కార్యక్రమం పండగలా సాగింది. ఇక్కడి వాతావరణం చాలా సందడిగా మారిపోయింది. మా ఇంటిని చూసుకున్నాం. చాలా బాగుంది. అందరికీ నచ్చింది. త్వరలోనే మా ఇంట్లోకి మారిపోతాం.

– బూరాడ వెంకటలక్ష్మి, ఆదర్శనగర్, కొత్తపాలెం

అద్దె బాధ తప్పింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల పనులు వేగవంతం చేశారు. చాలా నాణ్యంగా ఇల్లు నిర్మించారు. మా సొంతింటి కల నెరవేరడంతో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఇక నుంచి అద్దె బాధ తప్పనుంది.

– కర్రి చంద్రకళ, ఇందిరానగర్, గోపాలపట్నం

ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు



గతంలో రిజిస్ట్రేషన్లకు మేమే డబ్బులు పెట్టుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ బాధ తప్పింది. ఇంటిపై మేము కట్టాల్సిన దానికంటే తక్కువ కట్టించుకున్నారు. అంతే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు.జగనన్నకు కృతజ్ఞులమై ఉంటాం. మళ్లీ మా జగనన్నే రావాలి.

– కాకి కమల, గౌరి లక్ష్మీనగర్, గోపాలపట్నం

అదృష్టంగా భావిస్తున్నా..



ఇక్కడ ఇల్లు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. ఇది ఎంతో బాగుంది. గృహ ప్రవేశాలు కూడా బాగా చేశారు. వ్రతం అయిన తర్వాత మాకు భోజనాలు పెట్టారు. ఇంట్లో ఫంక్షన్ చేసుకున్నట్లుగా అనిపించింది. ఇంత మంచిగా ఏర్పాట్లు చేసిన ఆనంద్ కుమార్‌కు కృతజ్ఞతలు.

కె. నాగమణి, బాజీ జంక్షన్

సందడిగా ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం

పాల్గొన్న రాజ్య సభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి


ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఆల్ఫా కృష్ణ

గోపాలపట్నం: విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆల్ఫా కృష్ణ ప్రమాణ స్వీకార కార్యక్రమం గోపాలపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజ్య సభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బి.సన్నికృష్ణ (ఆల్ఫా కృష్ణ) చేత పలు పత్రాలపై సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు కలిగించేలా పని చేయాలన్నారు. రైతు బజార్లను మరింత అభివృద్ధి చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బీఆర్‌టీఎస్ రహదారి నుంచి కోలాటాలు, విచిత్ర వేషధారణలు, తీన్‌మార్, కేరళ నృత్యాలతో సుబ్బారెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్, పార్లమెంట్ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

నేడు పల్స్ పోలియో

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. యూపీహెచ్‌సీ పరిధిలో 0 నుంచి ఐదేళ్ల పిల్లలకు పోలియో చుక్కల మందు వేయనున్నారు. యూపీహెచ్‌సీ పరిధిలోని 8,705 ఇళ్లలో 2,690 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలనే అంచనాతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవసరమైన వ్యాక్సిన్ సరఫరా చేశారు. ఎంపిక చేసిన బూత్‌లో ఆదివారం పోలియో చుక్కలు వేసి, సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటినీ సందర్శించి పిల్లలందరికీ చుక్కలు ముందు వేసేలా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. పోలియో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి కోరారు.

'కార్పొరేట్ శక్తులకు బీజేపీ ఊడిగం'


దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1115వ రోజు, శనివారం సంస్థలోని వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగి బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో నేడు దీక్షా శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు జరగనున్న పాదయాత్ర కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దైవ సంకల్పంతోనే విజయం

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- ఘనంగా సింహగిరి శ్రీనివాసం ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజకు హాజరైన ప్రజలు


భూమి పూజ అనంతరం మాట్లాడుతున్న ఎంపీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఆనంద్‌కుమార్, మళ్ల విజయ ప్రసాద్, శ్రీధర్ తదితరులు


కోలాటమాడుతున్న మహిళా భక్తులు

విశాఖ విద్య: దైవ సంకల్పంతో చేపట్టిన ఎలాంటి కార్యక్రమమైనా విజయం వరిస్తుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజు నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ సింహగిరి శ్రీనివాసం స్వామి వారి ఆలయం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కాలనీకి ఆనుకుని ఉన్న సింహాచలం దేవస్థానం భూమి కేటాయించాలని సీతారామరాజు నగర్, సుసర్ల కాలనీ, ఏపీ ఎస్ఈబీ కాలనీ వాసుల విన్నపాన్ని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వకర్త ఆడారి ఆనంద్ కుమార్ తెలుపగా దాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సీఎం సూచనల మేరకు సంబంధిత శాఖల సమన్వయంతో ఆలయ నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులను సకాలంలో ఇప్పించినట్టు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఆడారి ఆనంద్ కుమార్ రూ.20 లక్షలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అతి తక్కువ సమయంలో ఆలయ నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులు లభించడం దైవ సంకల్పమేనని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. సనాతన ధర్మం ప్రపంచానికి ఆదర్శమని, హైందవ సంస్కృతిని నలుదిశలా చాటేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాస మూర్తి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాద రెడ్డి, స్థానిక కాలనీ పెద్దలు విల్లా శ్రీనివాసరావు, సత్యనారాయణ రావు, అజయ్, సీతారామ రాజు నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షులు మందపాటి శ్రీనివాస రాజు, కార్పొరేటర్ పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కేటీబీ కళా క్షేత్రం ప్రారంభం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో నూతనంగా నిర్మించిన కేటీబీ కళాక్షేత్రం రెండో అంతస్తు ఆదివారం ప్రారంభించనున్నట్లు కేటీబీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, సెక్రటరీ భాస్కరావు తెలిపారు. కాపు, తెలగ, బలిజ కులస్తుల కార్యక్రమాల నిర్వహణకు కళా క్షేత్రం నిర్మించినట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి


నాగేశ్వరరావును అభినందిస్తున్న సభ్యులు

విశాఖ విద్య: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాముల్యు కావాలని అసోసియేషన్ ఆఫ్ ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ (105–మర్రిపాలెం) అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు అన్నారు. మర్రిపాలెం వాకర్స్ క్లబ్‌లో శనివారం క్లబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గతేడాది చేపట్టిన క్లబ్ కార్యక్రమాలపై సమీక్షించారు. అసోసియేషన్ బలోపేతంపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. 2024–25 సంవత్సరానికి క్లబ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొలుసు నాగేశ్వరరావు, కార్యదర్శిగా డి. లక్ష్మణరావు , కోశాధికారిగా గంటా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ అనాథలు, పేదలకు వస్త్రాలు, రేషన్ వంటి నిత్యావసరాలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. అవసరమైన వారికి తోచిన రీతిలో సాయం అందించడం ద్వారా సంతృప్తి కలుగుతుందన్నారు. సమావేశంలో రాజేశ్వరరావు, ఈటి సత్యనారాయణ, పట్నాయక్, మురళీ, సత్య ప్రకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాల్లో దుకాణాలు తొలగించండి

- ఆర్‌వో బాబూరావు

మల్కాపురం: జీవీఎంసీ రెవెన్యూ అధికారులు 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌ను శనివారం సందర్శించారు.వ్యాపారులు సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో ఇక్కడకు వచ్చారు. పలువురు వ్యాపారులు వారికి కేటాయించిన షాపులతో పాటు ముందు ఉన్న ఖాళీ ప్రదేశాల్లో అనధికారికంగా వ్యాపారాలు సాగించడం, షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోనే ద్విచక్ర వాహనాలను పార్కు చేస్తుండడం వంటి సమస్యను గుర్తించారు.వెంటనే వ్యాపారులతో ఆర్‌వో బాబూరావు సమావేశం అయ్యారు.అనధికారికంగా వ్యాపారాలు సాగించడం సరికాదని, తక్షణం ఆక్రమిత స్థలాల్లో ఉన్న దుకాణాలు తొలగించాలని ఆదేశించారు. లేదంటే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సందర్భంగా వ్యాపారులు తమకు కనీస వసతులు కల్పించాలని కోరారు.దీనిపై అధికారులతో మాట్లాడి వసతులు సమకూర్చే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి పుష్పార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోస్వామివారికి శనివారం పుష్పార్చన నిర్వహించారు. బాలాజీ విశేష అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. సినీ నటుడు రవి ప్రకాష్ శనివారం స్వామిని దర్శించుకున్నారు.దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధు లు రవి ప్రకాష్‌కు ఘన స్వాగతం పలికారు.

ఉత్సాహంగా ఉక్కు మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం, విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలో క్రికెట్, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె.సోట్టీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పోటీల్లో పాల్గోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, ఏసీఎస్ విభాగాధిపతి వి.చిట్టిబాబు, విప్స్ కో–ఆర్డినేటర్ కె.ఎస్.చంద్రావతి, స్పోర్ట్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com